

కులశేఖర ఆళ్వార్ మార్గం

తిరుపతిలో నూతనంగా నిర్మించిన కులశేఖర ఆళ్వార్ మార్గం అద్భుతమని డెప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి కొనియాడారు. - 8లో



నేత్రపర్వం..స్వర్ణ రథం

శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వర్ణ రథోత్సవం వైభవంగా సాగింది. - 8లో



వైభవంగా ధ్వజారోహణం

తలకోన సిద్ధేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణ ఘట్టాన్ని వైభవంగా నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

మహిళా వర్సిటీ స్నాతకోత్సవం రేపు



మాట్లాడుతున్న వీసీ డీ భారతి

తిరుపతి సిటీ: శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ 21వ స్నాతకోత్సవం గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు వీసీ డీ భారతి తెలిపారు. మంగళవారం వర్సిటీ సావేరీ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్నాతకోత్సవంలో 57మంది విద్యార్థినులకు గోల్డ్‌మెడల్స్, 12 మందికి బుక్ ప్రైజ్‌లు, నలుగురికి నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. దీంతో పాటు 86మంది విద్యార్థినులకు పీహెచ్‌డీ, ఇద్దరికి ఎంఫిల్, పీజీలో 771 మందికి, యూజీ డిగ్రీలు 567 మందికి, డిస్టెన్స్ మోడ్‌లో 50 మంది పీజీ, 72 మంది యూజీ విద్యార్థినులకు పట్టాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పద్మభూషణ్ అవార్డు గ్రహీత, ప్రముఖ ఇండియన్ ప్లేబ్యాక్ సింగర్ పి సుశీలకు వర్సిటీ గౌరవ డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథులుగా వర్సిటీ చాన్స్‌లర్, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, విద్యాశాఖ మంత్రి బొత్ససత్యనారాయణ, ఇస్రో మాజీ సైంటిస్ట్ మంగళమణి హాజరవుతారని తెలిపారు. రిజిస్ట్రార్ ఎన్ రజిని, ప్రొఫెసర్ త్రిపుర, శ్రీదేవి, జీవన్‌జ్యోతి, పీఆర్‌ఓ రజిని పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 655 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్: ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన ద్వితీయ సంవత్సర పరీక్షలకు మొత్తం 655 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఇంటర్ ఆర్‌ఐఓ జీవీ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లాలోని 87పరీక్షా కేంద్రాల్లో ఇంగ్లిష్-2 పరీక్ష జరగగా.. ఇందులో జనరల్‌లో 27,052 మంది, ఒకేషనల్‌లో 1,178మంది, మొత్తం 28,230మంది హాజరవ్వాల్సి ఉందన్నారు. ఇంటర్ పరీక్షల్లో భాగంగా బుధవారం 87పరీక్షా కేంద్రాల్లో ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటలకు మ్యాథ్స్-1, బోటనీ-1, సివిక్స్-1 పరీక్షలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

పశు విజ్ఞాన ప్రదర్శనకు విశేష స్పందన



పశు అస్తిపంజరంలోని భాగాలపై అవగాహన కల్పిస్తున్న డీన్ డాక్టర్ జగపతిరామయ్య

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో రెండు రోజుల పాటు జరగనున్న పశు విజ్ఞాన ప్రదర్శన మంగళవారం ప్రారంభమైంది. మొదటి రోజు తిరుపతి పరిధిలోని పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు విజ్ఞాన ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య సందర్శనకు వచ్చిన విద్యార్థులకు పశు శరీర నిర్మాణ శాస్త్రంలో పొందుపరిచిన అస్తిపంజరాల విభాగాలపై అవగాహన కల్పించారు. వర్సిటీలోని ఇన్ఫర్మేషన్ సెంటర్, పౌల్ట్రీ ఫాం, కుందేళ్ల ఫామ్, పందుల పెంపక విధానం, పెథాలజీ మ్యూజియం, డైరీ టెక్నాలజీ ఉత్పత్తుల తయారీ విభాగాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం డాగ్ షో విద్యార్థులను ఆకట్టుకుంది.

వర్సిటీలో జాతీయ స్థాయి సాంకేతిక పోటీలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్ మల్లికార్జున

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో సెల్రెస్టా-24 పేరుతో రెండు రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి సాంకేతిక పోటీలను మంగళవారం కళాశాల డైరెక్టర్ మల్లికార్జున జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు జాతీయ స్థాయి పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో ప్రధానంగా టెక్నికల్ యాడ్స్, కోడింగ్, టెక్ టాక్స్, సైన్స్ కాన్వాస్, టెక్నికల్ వోడ్ బిల్డింగ్, స్నేక్ అండ్ ల్యాడర్ వంటి వాటిపై క్విజ్ పోటీలు ఉంటాయన్నారు. దేశవ్యాప్తంగా పలు ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థినులు పాల్గొంటారన్నారు.



• నాపేరు పీ.మురళీకృష్ణ, తిరుపతి ఎస్వీయూ క్యాంపస్ నగరపాలక ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్‌ని. కొత్త మెనూ వచ్చాక పిల్లలకు వడ్డిస్తున్న భోజనం చాలా బాగుంది. ఒక్కో రోజు ఒక్కో వంటకం వండడంతో పిల్లలు సంతోషంగా తింటున్నారు. దీనికి తోడు గుడ్డు, చిక్కీ, రాగి జావా ఇస్తుండడంతో పిల్లలు, తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మునుపటితో పోలిస్తే హాజరుశాతం మెరుగు పడింది.



• మాది తిరుపతి. నా పేరు కే.గిరి. నాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. వీళ్లంతా తిరుపతిలోని ఎస్వీయూ క్యాంపస్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు. తాపి పనులు, ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నా. మేము ఇంట్లో కూడా ఇంతలా పిల్లలకు మంచి భోజనం పెట్టేవాళ్లం కాదు. ప్రతి రోజూ గుడ్డు, చిక్కీ, రాగి జావా ఆహారంగా తీసుకోవడంతో ఇది వరకంటే ఇప్పుడు పిల్లలు ఎంతో ఆరోగ్యంగా ఉన్నారు. చాలా సంతోషంగా ఉంది. జగనన్నకు ధన్యవాదాలు



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

జగనన్న గోరుముద్ద మెనూ

సోమవారం	:	పొంగల్, ఉడికించిన గుడ్డు / వెజ్ పలావ్, ఎగ్ కర్రీ, చిక్కీ
మంగళవారం	:	చింతపులుసు పులిహోర, దొండకాయ చట్నీ, ఉడికించిన గుడ్డు, రాగి జావా
బుధవారం	:	వెజిటబుల్ రైస్, ఆలు కుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ
గురువారం	:	సాంబార్ బాత్/టమాట చట్నీతో టమాట రైస్, ఉడికించిన గుడ్డు, రాగి జావా
శుక్రవారం	:	అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డుతో పాటు చిక్కీ
శనివారం	:	ఆకు కూర, వెజ్ రైస్ (పాలకూర, కొత్తిమీర)

తిరుపతి నియోజకవర్గ సమాచారం

పాఠశాల స్థాయి	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	48	4,847
ప్రాథమికోన్నత	09	1,270
ఉన్నత	20	9,024
మొత్తం	77	15,141

పౌష్టిక మెనూ..

ఇష్టంగా తినుట

మిడ్డే మీల్స్ అదుర్స్

- విద్య, ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట
- కొత్త మెనూతో జగనన్న గోరుముద్ద
- రోజుకో వంటకంతో పిల్లలకు పౌష్టికాహారం
- సంతృప్తి వ్యక్తంచేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

తిరుపతి ఎడ్యుకేషన్: చదువుతోనే సమాజంలో ఆర్థిక అసమానతలు తొలుగుతాయని ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి బలంగా నమ్మారు. 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యకు అధిక ప్రాధాన్యత కల్పించారు. ప్రభుత్వ విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసి, సమూల మార్పులు చేశారు. పిల్లల చదువు తల్లిదండ్రులకు భారం కాకూడదని, అలాగే బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలన్న లక్ష్యంతో అమ్మఒడి పథకంతో పాటు విద్యాదీవెన, వసతి దీవెన, జగనన్న విద్యాకానుక వంటి వినూత్న పథకాలకు శ్రీకారం చుట్టారు. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు పునర్జీవం పోశారు. విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడేందుకు వీలుగా ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ విద్యాబోధన తీసుకొచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించాలన్న మహోన్నతాశయంతో మధ్యాహ్న భోజన పథకానికి మరింత మెరుగులు దిద్దారు. ఇందులో భాగంగానే జనవరి 21, 2020లో జగనన్న గోరుముద్ద పథకానినికి శ్రీకారం చుట్టారు. దీనికోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నారు.



పథకం అమలు ఇలా..

తిరుపతి నియోజకవర్గంలో ఇస్కాన్ సంస్థ ద్వారా మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు 100 గ్రాములు, 6 నుంచి 10వ తరగతి వరకు 150 గ్రాముల బియ్యంతో అన్నం, కూర అందించాలి. దీనికి కావాల్సిన బియ్యం ప్రభుత్వం సరఫరా చేస్తోంది. ఆకు కూరలు, కూరగాయల కొనుగోలు, వంట చేసేందుకు 1 నుంచి 5వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ.5.88, 6 నుంచి పదో తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ.8.15 ప్రభుత్వం చెల్లిస్తోంది. విద్యార్థులకు అవసరమైన గుడ్లను ఆయా పాఠశాలలకే ప్రభుత్వం చేరవేయగా. వాటిని ఉడికించేందుకు ఒక్కో గుడ్డుకు 10 పైసలు చొప్పున ఇస్కాన్ సంస్థ ఆయా పాఠశాలలకు ఇస్తోంది.



ప్రార్థనానంతరం మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

రుచిగా ఉంది



పాఠశాలలో మధ్యాహ్నం భోజనం చాలా రుచిగా ఉంది. రోజూ గుడ్డు ఇస్తున్నారు. అలాగే చిక్కీ, రాగి జావా ఇస్తున్నారు. ఇవి ఎంతో రుచికరంగా ఉంది. కాస్త కూడా మిగల్చకుండా తినేస్తున్నా.- టీ.శ్రీచందన, 4వ తరగతి, ఎస్వీయూ క్యాంపస్ నగరపాలక ప్రాథమిక పాఠశాల, తిరుపతి

కడుపారా తినేస్తున్నా



మా స్కూల్లో మధ్యాహ్నం పెడుతున్న అన్నాన్ని ఒక్క మెతుకు వదలకుండా కడుపారా తినేస్తున్నా. గుడ్డు, చిక్కీ, రాగి జావా ఇవన్నీ ఎంతో రుచిగా ఉన్నాయి. కొంచెం కూడా మిగల్చకుండా తింటున్నా. - ఎస్.జాయ్ జోస్పర్, 5వ తరగతి, నగరపాలక సంస్థ ఎస్వీయూ క్యాంపస్ ప్రాథమిక పాఠశాల, తిరుపతి

రోజూ గుడ్డు



మా స్కూల్లో ఐదు రోజులు మధ్యాహ్న భోజనంలో ఉడికించిన గుడ్లు ఇస్తున్నారు. ఇదివరకు మా ఇంట్లో వారానికి ఒకట్రెండు మార్లే గుడ్డు తినేదాన్ని. ఇప్పుడు రోజూ గుడ్డు తింటున్నా. థ్యాంక్స్ టు సీఎం జగన్ అంకుల్. - కే.మేఘన జయంతి, 5వ తరగతి, ఎస్వీయూ క్యాంపస్ నగరపాలక ప్రాథమిక పాఠశాల, తిరుపతి

జగనన్నకు ధన్యవాదాలు



ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారమే రోజూ బలవర్ధకమైన ఆహారాన్ని ఇస్తున్నారు. ఇవి ఎంతో రుచి, శుచిగా ఉండడంతో పిల్లలు చాలా ఇష్టంగా తింటున్నారు. ఇటు మంచి చదువు, అటు పౌష్టికాహారం అందిస్తున్న సీఎం జగనన్నకు ధన్యవాదాలు. - సాయిప్రసన్న, తల్లి, తిరుపతి

భలే బాగుంది



రోజూ మధ్యాహ్నం పెడుతున్న అన్నం భలే బాగుంది. సాంబారు, పప్పు అన్నం, పలావ్ అన్నాన్ని ఇష్టంగా తింటున్నా. రోజూ గుడ్డు ఇస్తున్నారు. చిక్కీ, రాగి జావా చాలా బాగున్నాయి. - ఎస్.ఖాదర్‌బీ, 4వ తరగతి, ఎస్వీయూ క్యాంపస్ నగరపాలక ప్రాథమిక పాఠశాల, తిరుపతి

మెండైన పోషణ విలువలు



గతంతో పోలిస్తే ప్రస్తుతం జగనన్న గోరు ముద్ద పథకం ద్వారా అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో మెండైన పోషణ విలువలున్నాయి. నిత్యం ఆకు కూరలు, కూరగాయలు, బలవర్ధకమైన ఆహారంలో పిల్లల ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషకాలు లభిస్తుండడంతో పిల్లలు చురుగ్గా ఉన్నారు. -బీ.సరిత, ఉపాధ్యాయురాలు, ఎస్వీయూ క్యాంపస్ నగరపాలక ప్రాథమిక పాఠశాల

టీటీడీలో భూమనది ప్రత్యేక ముద్ర

- శ్రీవేంకటేశ్వరస్వామి వైభవాన్ని చాలా అద్భుతంగా నడిపించారు
- చైర్మన్‌కు ధర్మారెడ్డి అప్పుడు ఇప్పుడు చేదోడు వాదోడుగా ఉన్నారు

సాక్షి, తిరుపతి : తిరుమల తిరుపతి దేవస్థానానికి ఎంతో మంది చైర్మన్లు వచ్చారు గానీ, వాళ్లలో ప్రత్యేక ముద్ర వేసిన చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి ఒక్కరే అని విశాఖ శ్రీశారదా పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి స్పష్టం చేశారు. తిరుపతిలో భూమన నివాసంలో మంగళవారం షణ్ముఖ హోమం నిర్వహించారు. ఈ హోమంలో విశాఖ శ్రీశారదా పీఠాధిపతి, విశాఖ ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామిజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ.. కరుణాకరరెడ్డి మోకాళ్ల ఆపరేషన్ జరిగిన కారణంగా ఇంటికి విచ్చేసి, చూడాలని అనిపించిందని వెల్లడించారు. ఈ ఒక్క కోరిక చేతే తాము రావడం జరిగిందని స్వామీజీ స్పష్టం చేశారు. అత్యున్నత హైందవ జాతికి రెండు రాష్ట్రాల్లో ఎన్నో సేవలందించిన భూమన కరుణాకరరెడ్డి అంటే తమకు చాలా ప్రాణమన్నారు. రెండు రాష్ట్రాలు కలిసి ఉన్నప్పుడు తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి వైభవాన్ని చాలా అద్భుతంగా నడిపించింది చైర్మన్ కరుణాకర రెడ్డే అని తెలిపారు. అన్నమయ్య విగ్రహాన్ని గొప్పగా ప్రతిష్టాపన చేసి అన్నమయ్య గొప్పతనాన్ని వెలికి తీయడం, తరిగొండ వెంగమాంబ ఉత్సవాలు కొత్తగా నిర్వహించడం జరిగిందన్నారు. శ్రీవెంకటేశ్వర స్వామి అద్భుత జ్యోతి అనేది కరుణాకర రెడ్డి హృదయంలో ఉంది కనుకే, ఎంతో కష్టమైనా కరుణాకర రెడ్డిని చూసేందుకు ఇంత దూరం రాగలిగామని చెప్పారు. టీటీడీ చైర్మన్‌కి అప్పుడు, ఇప్పుడు ఈఓ ధర్మారెడ్డి చేదోడు వాదోడుగా ఉంటూ.. తనపై ఎన్ని విమర్శలు చేసినా.. ఎంతో నిబద్ధతతో అద్భుతమైన పరిపాలన అందిస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్వేత డైరెక్టర్ భూమన్, వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి పాల్గొన్నారు.



షణ్ముఖ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సాక్షాత్తు భగవత్ స్వరూపులు

విశాఖ శ్రీశారదా పీఠాధితులు శ్రీస్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామీజీ, ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీల రాకతో నా మనస్సు ఆనందంతో నిండిపోయింది. సాక్షాత్తు భగవతవ్ స్వరూపమైన విశాఖ శారదా పీఠాధితులు వ్యక్తిగతంగా మా ఇద్దరి మధ్య ఆత్మీయ బంధం ఉంది. గతంలో కూడా మా స్వగృహానికి విచ్చేసి, మా గృహాన్ని పావనం చేశారు. స్వామివారి పాదపద్మాలకు నా నమస్సులు. - భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే



నమస్కరిస్తున్న స్వామీజీలు, టీటీడీ చైర్మన్ భూమన, డెప్యూటీ మేయర్ అభినయ్, ఈఓ ధర్మారెడ్డి

సూర్య తేజం.. భవుని వైభోగం



ఉదయం పురవీధుల ఉత్సవానికి బయలుదేరుతున్న స్వామి, అమ్మవార్లు



రాత్రి ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

- అంగరంగ వైభవంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు
- ఉదయం సూర్యప్రభ, చప్పర వాహనాలపై విహరించిన శివయ్య
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. మూడో రోజు మంగళవారం ఉదయం స్వామివారు సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. జ్ఞానప్రసూనాంబ అమ్మవారు చప్పరాన్ని అధిరోహించి స్వామవారిని అనుసరించారు. సూర్యప్రభ వాహనంపై పరమశివుడు సర్వాలంకార శోభితుడై విహరిస్తుండగా.. మూషిక వాహనంపై వినాయకస్వామి, శ్రీవళ్లి, దేవసేన సమేత కుమారస్వామి, చండికేశ్వరుడు, భక్తన్నప్ప స్వామి వెంట సాగారు. మంగళ వాయిద్యాలు, మేళతాళాలు, కోలాటాలు, భజన బృందాలు, భక్తులు శంఖం ఊదుతూ వెళుతుండా స్వామి, అమ్మవార్ల పురవిహారం చేశారు. ఇదిలా వుండగా రాత్రి జరగాల్సిన భూత, సుఖ వాహన సేవలు అనివార్య కారణాల వల్ల రద్దయ్యాయి.

నేటి వాహన సేవలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం గాంధర్వరాత్రి సందర్భంగా ఉదయం స్వామి, అమ్మవార్లు హంస, యాళి వాహనాలపై ఊరేగనున్నారు. అలాగే రాత్రి రావణుడు, మయూర వాహనాలపై ఊరేగనున్నారు.

భక్తులకు సులభమైన దర్శనం

- ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

భక్తులకు సురక్షితమైన, సులభమైన దర్శనం చేసుకునే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నామని తిరుపతి జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ స్పష్టం చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయ బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మంగళవారం ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, పార్కింగ్ ప్రాంతాలు, ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు, ట్రాఫిక్ మళ్లింపు ప్రదేశాలు, నాలుగు మాడవీధుల్లో ఆయన పర్యటించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు 1,200 మంంది పోలీసు సిబ్బందితో భద్రతాపరమైన చర్యలు చేపట్టనున్నట్టు వెల్లడించారు. ప్రతిచోటా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఆలయ ప్రాంగణంలో ఉన్న పోలీసకమాండ్ కంట్రోల్‌రూమ్‌కు అనుసంధానించనున్నట్టు పేర్కొన్నారు. సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. కల్యాణోత్సవం సందర్భంగా బాల్యవివాహాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. అదనపు ఎస్పీ కులశేఖర్, డీఎస్పీలు భాస్కర్ రెడ్డి, మహేశ్వరరెడ్డి, ఈవో నాగేశ్వరారవు, సీఐలు నరసింహారావు, శ్రీహరి, ఎస్ఐలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్‌పటేల్

ఎన్నికలపై ప్రత్యేక దృష్టి

- సామాన్యులకే మొదటి ప్రాధాన్యత
- తిరుపతి జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణకాంత్ పటేల్

తిరుపతి క్రైమ్: రానున్న ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తామని నూతన జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ స్పష్టం చేశారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ముందుగా పోలీసులు గౌరవ వందనం సమర్పించి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం నాయన విలేకరులతో మాట్లాడుతూ.. 2018లో ఐపీఎస్ అధికారిగా ఎంపికై రొంపచోడవరం ఏఎస్పీగా, కర్నూలు జిల్లా ఆదనపు ఎస్పీగా, విజయవాడ కమిషనరేట్లో శాంతి భద్రతల డీసీపీగా విధులు నిర్వహించానన్నారు. అనంతరం బదిలీపై తిరుపతిలో బాధ్యతలు స్వీకరించడం చాలాఆనందంగా ఉందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించమని స్పష్టం చేశారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు, వృద్ధులకు, చిన్నపిల్లలకు పెద్దపీట వేస్తామన్నారు. పోలీస్ సిబ్బంది కూడా క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. పోలీస్ వెల్ఫేర్ కూడా తమవంతు కృషి చేస్తామని చెప్పారు. సిబ్బందికి ఎలాంటి అవసరం వచ్చినా తనను నేరుగా సంప్రదించవచ్చని సూచించారు.



నూతన ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిస్తాం

రానున్న ఎన్నికలను ప్రశాంతంగా జరిగేలా తమ వంతు కృషి చేస్తానని ఎస్పీ తెలిపారు. ఎన్నికలపై పూర్తిస్థాయిలో ఫోకస్ పెడుతామని స్పష్టం చేశారు. ఎక్కడా ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ముందు నుంచే చర్యలు చేపడతామని చెప్పారు. తిరుమల శ్రీవారిని దర్శించుకునే భక్తులకు శాంతి భద్రతల విషయంలో ఇబ్బందులు కలగకుండా కృషి చేస్తామని స్పష్టం చేశారు.

సమన్వయంతో పనిచేద్దాం

తిరుపతి అర్బన్: సమన్వయంతో పనిచేద్దాం.. వచ్చే సార్వత్రిక ఎన్నికలను విజయవంతం చేద్దామని కలెక్టర్ జీ.లక్ష్మీశ స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణకాంత్ పటేల్ కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు.

క్లుప్తంగా

హస్తకళలకు వెన్నుదన్ను



కలంకారీ కళాకారులతో విజయలక్ష్మి

ఏర్పేడు: హస్తకళలు భారతదేశానికి వెన్నెముక లాంటివని, వాటి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్(లేపాక్షి) చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం ఏర్పేడు గాండ్ల వీధిలో జరుగుతున్న కలంకారీ పెయింటింగ్ శిక్షణా కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. అక్కడ మహిళా కలంకారీ కళాకారులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలు, వస్త్రాలపై వారు చిత్రీకరిస్తున్న రామాయణ సన్నివేశాల బొమ్మలను తిలకించారు. ఈ సందర్భంగా కళాకారులు పలు సమస్యలు విన్నవించగా వాటి పరిష్కారానికి కృషిచేస్తామని ఆమె హామీ ఇచ్చారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఏర్పేడులో ఏపీ హెచ్‌డీసీ, డీసీహెచ్ ద్వారా రూ.4.27 లక్షలతో 30 మంది కలంకారీ మహిళా కళాకారులకు శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా నవరత్నాల ద్వారా హస్త కళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు గుర్తుచేశారు. శ్రీకాళహస్తి పెన్ కలంకారీకి ప్రపంచ వ్యాప్తంగా మంచి డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆల్‌ఇండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బడిగించల చంద్రమౌళి, తిరుపతి శ్రీనివాసం లేపాక్షి మేనేజర్ చలమత్తూరు రవి, శ్రీధర్, వీరాంజనేయులు, గుణశేఖర్, సాయి, నవీన్‌కుమార్, మునిలక్ష్మి, రమణయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పర్వం..
స్వర్ణ రథం

- కనుల పండువగా కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు
- హనుమంత, గజ వాహనాలపై వెంకన్న చిద్విలాసం



హనుమంత వాహనంపై వేంకటాద్రి రాముడు

చంద్రగిరి: శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆరో రోజు అయిన మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీహరి స్వర్ణ రథంపై విహరిస్తూ కనువిందు చేశారు. ఉదయం శ్రీనివాసుడు హనుమంత వాహనంపై వేంకటాద్రి రాముడు అవతారంలో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. అంతకముందు ఆలయంలో ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా తోమాల, అర్చన, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన, శాత్తుమొర, మొదటి గంట, బలి కార్యక్రమాలను నిర్వహించారు. తదుపరి మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి పరిణయ మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీహరి ఉత్సవర్లను స్వర్ణరథంపై అధిష్టింపజేసి అర్చకులు సంకల్ప పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మితో పాటు టీటీడీ అధికారులు స్వామి వారి సర్కారు హారతిని అందుకున్నారు. స్వర్ణ రథానికి ఏర్పాటు చేసిన తాడును టీటీడీ అధికారులు, భక్తులు గోవింద..గోవిందా.. అంటూ లాగుతూ తన్మయత్వం చెందారు. రాత్రి శ్రీమన్నారాయణుడు అలంకరణలో గజ వాహనంపై విహరిస్తూ స్వామివారు కనువిందు చేశారు. ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్‌లు వెంకటేష్, చెంగ్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆగమ సలహాదారుడు మోహనరంగాచార్యులు, అర్చకులు బాలాజీ రంగాచార్యులు పాల్గొన్నారు.



స్వర్ణరథంపై ఊరేగుతున్న స్వామి,అమ్మవార్లు

బ్రహ్మోత్సవాలలో నేడు

శ్రీనివాస మంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఏడవ రోజు అయిన బుధవారం స్వామి వారు ఉదయం సూర్య, రాత్రి చంద్రప్రభ వాహనానాలపై ఊరేగనున్నారు.

అద్భుతం.. కులశేఖర ఆళ్వార్ మార్గం



నూతన రహదారిని పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి తుడా: శ్రీకుల శేఖర ఆళ్వార్ మార్గం మాస్టర్ ప్లాన్ రోడ్లకే తలమానికంగా నిలవనుందని వైఎస్సార్ సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయ కర్త, నగర డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. హీరో హోండా రైల్వే గేట్ – కాటన్ మిల్ ప్రాంతాన్ని కలుపుతూ నూతనంగా నిర్మిస్తున్న 100 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్ పనులను అధికారులతో కలిసి ఆయన మంగళవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ నేడు నిర్మించిన రహదారులు రేపు తిరుపతి భవిష్యత్‌ను మారుస్తాయన్నారు. తిరుపతికి రాబోయే 50 ఏళ్ల అవసరాలను గుర్తించి నేడు అభివృద్ధి బాట పట్టించామని చెప్పారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే తిరుపతి దశ దిశను మారుస్తామని ఆయన స్పష్టం చేశారు. మరో రెండు రోజుల్లో కుల శేఖర ఆళ్వార్ మార్గం ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు. ఆయన వెంట పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు అజయ్‌మార్, డీఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్ నరేంద్రనాథ్, జేసీఎస్ అధ్యక్షుడు మద్దాలి శేఖర్ పాల్గొన్నారు.

విచారణకు హాజరుకాని రమణదీక్షితులు?

తిరుమల: టీటీడీ ఆలయ అధికారులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో శ్రీవారి ఆలయ మాజీ గౌరవ ప్రధానార్చకులు రమణదీక్షితులు విచారణకు హాజరుకాలేదని సమాచారం. గత నెల సోషల్ మీడియా వేదికగా చేసిన ఆరోపణపై టీటీడీ ఐటీ శాఖ జీఎం సందీప్‌రెడ్డి తిరుమల ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన వన్ టౌన్ పోలీసులు ఈనెల 5వ తేదీలోపు సదరు ఫిర్యాదుపై విచారణకు హాజరుకావాలని ఆయనకు నోటీసును పంపారు. అయితే ఆయన మంగళవారం విచారణకు హాజరుకాలేదని తెలుస్తోంది. వ్యక్తిగత కారణాలతో విచారణకు హాజరుకాలేనని పోలీసులకు సమాచారం అందించినట్లు సమాచారం.

టీటీడీ ప్రాణదాన పథకానికి 22 మంది ఎంపిక

తిరుపతి తుడా: స్విమ్స్ టీటీడీ ప్రాణదాన పథకం కింద ఉచిత శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు 22 మంది పేద రోగులను ఎంపిక చేశారు. మంగళవారం సిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ నేతృత్వంలో ప్రాణదాన కమిటీ సమావేశం నిర్వహించారు. రోగుల స్థితిగతుల ఆధారంగా ఉచిత ఆపరేషన్లకు సిఫార్సు చేశారు. ఇందులో న్యూరో సర్జరీ-6, కార్డియో థొరాసిక్- 5, మెడిసిన్ -4, నెఫ్రాలజీ -3, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ -3, న్యూరాలజీ -1 మొత్తం 22మంది పేదరోగులను ఎంపిక చేశారు. ప్రాణదాన కమిటీ సభ్యులు, టీటీడీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బీ.కుసుమకుమారి, స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, స్విమ్స్ ఆర్‌ఎంఓ కోటిరెడ్డి, రుయా డెప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంఓ రవికుమార్, గవర్నమెంట్ మెటర్నిటీ హాస్పిటల్ డాక్టర్ శ్రీనివాసులు, బర్డ్ హాస్పిటల్ డాక్టర్ రామమూర్తి, స్విమ్స్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ గోపి పాల్గొన్నారు.



రోగుల వివరాలను పరిశీలిస్తున్న స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్

వేసవి నేపథ్యంలో టీటీడీ ముందస్తు ఏర్పాట్లు

- తుంబురు తీర్థ ముక్కోటి ఏర్పాట్లపై ఈవో సమీక్ష

తిరుమల: తిరుమలకు వేసవిలో విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యాం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం జూలై వరకు కొనసాగనున్న వేసవి సెలవుల రద్దీకి సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. అనంతరం ఈవో మాట్లాడుతూ మొదటి ఘాట్ రోడ్డులోని అక్క గార్ల గుడి, శ్రీవారి సేవా సదన్, తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో చలువ పెయింట్ వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేలా చూడాలన్నారు. లడ్డూల బఫర్ స్టాక్‌ను ఉంచాలనిసూచించారు. యాత్రికుల కోసం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను తగినంత నిల్వ ఉంచాలని వైద్య అధికారులను ఆదేశించారు.

తుంబురు తీర్థం

మార్చి 25వ తేదీన తిరుమలలో జరగనున్న శ్రీ తుంబురు తీర్థ ముక్కోటికి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి విశేషంగా భక్తులు విచ్చేసే అవకాశముందని, ఇందు కోసం విస్తృతంగా ఏర్పాట్లు చేయాలని ఈవో అధికారులను ఆదేశించారు. 60 ఏళ్లలోపు వయస్సు ఉన్న యాత్రికులు, శారీరకంగా దృఢంగా ఉన్న యాత్రికులు మాత్రమే ఈ మార్గంలో ట్రెక్కింగ్‌కు అనుమతించనున్నట్లు స్పష్టం చేశారు. ఊబకాయం, గుండె జబ్బులు, ఉబ్బసం, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో ఉన్న యాత్రికులు వారి ఆరోగ్య భద్రత దృష్ట్యా అనుమతించమని చెప్పారు. మార్చి 24 ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, మళ్లీ మరుసటి రోజైన మార్చి 25న ఉదయం 5 నుంచి ఉదయం 11 గంటల వరకు మాత్రమే భక్తులను అనుమతించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్వీబీసీ సీఈవో శ్రీషణ్ముఖ్ కుమార్, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ-2 జగదీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సక్సెస్ అన్‌లిమిటెడ్

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం ప్రముఖ మోటివేషనల్ స్పీకర్‌మేధా చిరంజీవి సక్సెస్ అన్ లిమిటెడ్ యువతను ఆకట్టుకుంది. కార్యక్రమానికి ఎమ్మెల్యే బియ్యపు మధసూదన్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం విచేశారు. ముందుగా యువతతో ఎమ్మెల్యే కుమార్తె పవిత్రారెడ్డి మాట్లాడారు. శ్రీకాళహస్తి అభివృద్ధికి యువత సూచనలు ముఖ్యమని, వారి సలహాలు పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం మేధా చిరంజీవి మాట్లాడుతూ యువతకు విజయం సాధించడంలో మెలకువలు నేర్పారు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి, ఆలయ మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, గుమ్మడి బాలకృష్ణయ్య, లోకేష్‌యాదవ్, పగడాల రాజు, ఉన్నం వాసునాయుడు, సిరాజ్‌బాషా, కూనాటి రమణయ్య యాదవ్, ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, కోవి చంద్రయ్యనాయుడు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే సమాజ శ్రేయస్సు

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపు



మహిళలకు చెక్కు అందజేస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, రాస్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: మహిళా సాధికారతతోనే అభివృద్ధి, సమాజం శ్రేయస్కరమని, ఆ దిశగా విధానాల్లో మార్పులతో పాటు సామాజిక చైతన్యం, కుటుంబ ప్రోత్సాహం అత్యంత అవశ్యకమని మాజీ ఉపరాష్ట్రపతి, పద్మ భూషణ్ అవార్డు గ్రహీత ముప్పవరపు వెంకయ్య నాయుడు తెలిపారు. రాష్ట్రీయ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం పీఎల్‌ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం రాస్ అధినేత మునిరత్నం స్మృతికి నివాళి అర్పించారు. అనంతరం ఆయన రాస్ అందిస్తున్న సేవలు కొనియాడారు. ప్రతి జిల్లాలోనూ ఇలాంటి సంస్థలు సేవలందించాలన్నారు. ఈ వేదిక నుంచి పలువురు మహిళలకు స్వయం ఉపాధి కోసం రుణాలందించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం వెంకయ్య నాయుడును ఘనంగా సత్కరించారు. ద్రవిడ వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కొలకలూరి మధుజ్యోతి, సహస్ర అవధాని మేడసాని మోహన్, రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం, అధ్యక్షుడు సుందర వడివేలు, ఉపాధ్యక్షుడు చిరంజీవి, డైరెక్టర్లు నాగరాజు, మోహన్, శ్రీనివాస్, రమేష్‌రెడ్డి, యువరాజు, ప్రసాద్, భాను, కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం

- తలకోన బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

భాకరాపేట: తలకోన శ్రీసిద్ధేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలకు మంగళవారం అంగరంగ వైభవంగా అంకురార్పణ నిర్వహించారు. దక్షిణ కై లాసంగా పేరొందిన తలకోనలో శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉదయం మహా గణపతి, గోపూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, కలశ స్థాపన, రుద్ర పారాయణం, పూర్ణాహుతి కార్యక్రమాలను అట్టహాసంగా నిర్వహించారు. సాయంత్రం ప్రదోష కాలంలో నందీశ్వరుడికి అభిషేకం చేశారు. అనంతరం ధ్వజారోహణం అత్యంత వైభవంగా నిర్వహించారు. తలకోన ట్రస్టు బోర్డు చైర్మన్ భూమిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి జయకుమార్, పాలక మండలి సభ్యులు నాగిరెడ్డి, మంజుల, నరేష్, మధుసూదనశెట్టి, జయంత్, గంగోజీ, రాజేశ్వరి, గీత, ఆలయ ప్రధాన అర్చకులు శివప్రసన్నశర్మ పాల్గొన్నారు.



తలకోనలో ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

కోడిపందెం స్థావరాలపై దాడులు

కోట: మండలంలోని సిద్ధవరం సమీప పొలాల్లో కోడిపందెం స్థావరాలపై మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించి 11మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఐదు కోళ్లు, రూ.3,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

రాపూరు అభివృద్ధికి ఆనం ఆటంకం

రాపూరు: రాపూరు మండల అభివృద్ధికి ఆటంకం కలిగించిన వ్యక్తి వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామ్‌నారాణరెడ్డి అని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక తెలుగుగంగ అతిథిగృహంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాపూరులో గత రెండు రోజులుగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ.. స్థానికుల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. పట్టణంలో డ్రైనేజీ, మంచినీరు, రోడ్ల సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. వీటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతామని ఆయన స్పష్టం చేశారు. గతంలో మంత్రిగా, ఎమ్మెల్యేగా పనిచేసిన రామ్‌నారాయణరెడ్డి ఎటువంటి అభివృద్ధిపనులు చేయకపోవడమే దీనికి కారణమన్నారు. పలువురికి ఇళ్ల మంజూరు చేసి రద్దు చేసినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఆయన అభివృద్ధి చేయకపోవడమేగాక పార్టీలో ముఠా తత్వాన్ని ఏర్పాటు చేసి ప్రోత్సహించారని మండిపడ్డారు. అల్తూరు పాడు ప్రాజెక్టు నిలిచిపోవడానికి కారణం ఆనం కాదా..? అని ప్రశ్నించారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయ ఢంకా మోగించి మరో మారు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించడం ఖాయమన్నారు. వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులందరికీ జగనన్న ఇళ్లు కట్టించి ఇస్తానని హామీ ఇచ్చారు. అలాగే రాపూరు పంచాయతీని మోడల్ పంచాయతీగా తీర్చిదిదుతామని, వైద్యశాల అభివృద్ధి, పెంచలకోన పుణ్యక్షేత్రం, కండలేరు డ్యాంను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. మిని స్టేడియం, రైతులకు కోల్డ్ స్టోరేజ్ తదితర వాటిని అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

మిచాంగ్ బాధిత రైతులకు..
నేడు ఇన్‌పుట్ సబ్సిడీ

తిరుపతి అర్బన్: మిచాంగ్ తుపాన్‌తో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీని అందించడానికి శ్రీకారం చుట్టింది. గత ఏడాది డిసెంబర్ 4న మిచాంగ్ తుపాన్ జిల్లాలో అల్లకల్లోలం సృష్టించింది. దీనికారణంగా పంట దెబ్బతిన్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నేడు ఇన్‌పుట్ సబ్సిడీ అందించనున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి ఎస్ ప్రసాద్‌రావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తాడేపల్లి నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. అదే సమయంలో తిరుపతి కలెక్టరేట్ నుంచి జిల్లా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 2,725 హెక్టార్లలో పంట నష్టం జరిగిన 5,650 మంది రైతులకు రూ.4.90 కోట్లు, ఉద్యానశాఖ ద్వారా 469 హెక్టార్లలో 1,346 మంది రైతులకు రూ.కోటి వరకు జమకానుందని తెలిపారు. మరోవైపు మంగళవారంతో రబీకి సంబంధించిన ఈక్రాప్ ప్రక్రియ పూర్తిచేయనున్నట్టు వెల్లడించారు.



ఎస్.ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి